నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, సోమవారం 2 సెప్టెంబర్ 2024 | SIDDIPET

అధికారులు అలర్ట్‌గా ఉండాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, సెప్టెంబర్ 1: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గంలోని అధికారులు అలర్ట్‌గా ఉండి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆదేశించారు. ఆదివారం సిద్దిపేట నియోజకవర్గ అధికారులతో ఆయన టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నీటి వనరుల పరిస్థితులపై ఆరాతీశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సహాయక చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లలో ప్రజలు నివసించకుండా చర్యలు తీసుకోవాలని, కూలిన ఇండ్లకు నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, చెక్‌డ్యామ్‌లు పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సిద్దిపేట పట్టణంలో పిచ్చి మొక్కలు తొలిగించాలన్నారు. శివాజీ నగర్, కోమటి చెరువురోడ్డు, కొత్త బస్టాండ్ రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు.

సిద్దిపేట జిల్లా నంగునూరు బ్రిడ్జిపై నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

కొండపాక(కుకునూరుపల్లి): దుద్దెడ శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

సిద్దిపేట జిల్లా తొగుట చందాపూర్ వద్ద ప్రవహిస్తున్న కూడవెల్లి వాగు

మెదక్ జిల్లా ఏడుపాయల ఆలయం ఎదుట మంజీరా నదిలో వరద ప్రవాహం

పొంగిపొర్లుతున్న మంజీరా

పాపన్నపేట,సెప్టెంబర్1: మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని మంజీరా నది పొంగిపొర్లుతున్నది. దీంతో వనదుర్గప్రాజెక్టు పరవళ్లు తొక్కుతూ దుర్గామాత ఆలయం ముందు నుంచి నిజాంసాగర్ వైపు పరుగులిడుతున్నది. ఆదివారం ఏడుపాయల వన దుర్గామాత ఆలయాన్ని మూసివేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రాజగోపురంలో ఉంచి పూజలు చేశారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి పోలీసు సిబ్బందితో ఏడుపాయలకు చేరుకున్నారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా ఆలయ ఈవో చంద్రశేఖర్‌తోపాటు ఏడుపాయల సిబ్బందితో సమీక్షించారు.

లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి

సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో పర్యటిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో ఆదివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌కు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాలను స్థానిక నాయకులు, అధికారులతో కలిసి పరిశీలించారు. మార్కెట్ యార్డు, నాగారం రోడ్లలో వర్షపు నీరు ఉప్పొంగి లోతట్టు ప్రాంతాల్లోని ఇండ్లలోకి చేరడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ఇండ్లలోకి చేరిన నీటిని వెంటనే తొలిగించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైవే పనులు పూర్తయితే పట్టణంలో వరద ప్రభావం ఉండదని, త్వరలోనే హైవే పనులు పూర్తి చేసేలా అధికారులతో మాట్లాడామన్నారు. కోహెడ మండలం రామచంద్రాపూర్‌కు చెందిన చెందిన కనుకారెడ్డి ఆవుల కోసం వెళ్లి కెనాల్‌లో పడి మృతి చెందడం బాధాకరమన్నారు. ఆయన కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేసి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా, మండల అధికారులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులు ఎప్పటికప్పుడు గ్రామ స్థాయిలోని పరిస్థితులపై సమీక్షించాలని ఒక ప్రకటనలో ఆదేశించారు. ఇబ్బందుల ఎదురైతే సిద్దిపేట కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్‌లోని 08457230 000టోల్ ఫ్రీ నంబరుకు సంప్రదించాలని మంత్రి సూచించారు.

తోటపల్లి రిజర్వాయర్ వద్ద జాలరి గల్లంతు

బెజ్జంకి, సెప్టెంబర్ 1: సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని తోటపల్లి గ్రామానికి చెందిన సందరి లక్ష్మణ్(55) అనే జాలరి ఆదివారం గల్లంతైనట్లు గ్రామస్తులు తెలిపారు. రిజర్వాయర్ చెరువు గేట్ల మత్తడి వద్ద జాలరులందరూ కలిసి ఆదివారం చేపలు పట్టారు. సాయంత్రం కాగా మిగితా జాలర్లు ఆటోలో వెళ్లారు. తాను సైకిల్ మీద వస్తానని వారికి చెప్పిన లక్ష్మణ్ రాకపోవడంతో అనూనుమానంతో చూడగా, సైకిల్ అక్కడే ఉండగా లక్ష్మణ్ గల్లంతై ఉంటాడని గ్రామస్తులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఎస్సై కృష్ణారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం రిస్క్ టీంతో గాలింపు చర్యలు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రాష్ట్రస్థాయి టాపర్‌గా దుబ్బాక విద్యార్థి

దోర్నాల సుకుమార్

దుబ్బాక, సెప్టెంబర్ 1 : ఇంటర్మీడియట్ 2022-24 విద్యా సంవత్సరంలో ఒకేషనల్ కోర్సులో రాష్ట్రస్థాయి టాపర్‌గా దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి దోర్నాల సుకుమార్ నిలిచాడు. ఒకేషన్ కోర్సులో సుకుమార్ ఈటీ (ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్) చేశాడు. ఇంటర్మీడియట్‌లో 1000 మార్కులకు 994 మార్కులు సాధించి, రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచాడు. ఈనెల 4న హైదరాబాద్‌లో బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ వారు రాష్ట్ర స్థాయి టాపర్లకు నగదు పారితోషికంతో అవార్డు అందజేస్తున్నారని, ఇందులో సుకుమార్ అవార్డు అందుకుంటారని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ తెలిపారు.

చెరువును తలపిస్తున్న సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని అంబేద్కర్ చౌరస్తా

వాన జోరు...

వరద హోరు

పొంగిపొర్లుతున్న మెదక్ జిల్లా మాసాయిపేట మండల పరిధిలోని హల్దీప్రాజెక్టు

- మెదక్ జిల్లాలో సరాసరి 78.4 మి.మీ వర్షపాతం నమోదు
- అత్యధికంగా మెదక్‌లో 175.5 మి.మీ..
- అత్యల్పంగా మనోహరాబాద్‌లో 31.6 మి.మీ
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- చెరువులు, కుంటలకు జలకళ
- పంటలకు జీవం పోసిన వర్షం
- అధికారులను అప్రమత్తం చేసిన కలెక్టర్, ఎస్పీ

మెదక్, సెప్టెంబర్ 1 (నమస్తే తెలంగాణ) : మెదక్ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం రాత్రి ప్రారంభమైన వర్షం ఆదివారం వరకు విరామం లేకుండా కురిసింది. భారీ వర్షాలకు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెరువులు, కుంటల్లోకి భారీగా వర్షపు నీరు చేరుతోంది. చెరువులు, కుంటలతో పాటు చెక్ డ్యామ్‌లు అలుగు పారుతున్నాయి. రోడ్లన్నీ జలమయంగా మారాయి. మెదక్‌లో అత్యధికంగా 78.4 మీ.మీ, అత్యల్పంగా మనోహరాబాద్ మండలంలో 31.6 మీ.మీ వర్షపాతం నమోదైంది. ఈ సీజన్ జిల్లాలో ఇదే భారీ వర్షం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు, కుంటల్లోకి పెద్ద మొత్తం లో వరద వస్తుండడంతో భూగర్భ జలాలు పెరుగుతాయని భావిస్తున్నారు. వరినాట్లు వేసిన రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. చెరువుల్లోకి నీరు చేరుతుండడంతో సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి యంత్రాంగాన్ని అలర్ట్ చేశారు. వర్షాలు తగ్గే వరకు పోలీసు, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలోని ఘనపూర్ ఆనకట్ట, పోచారం ప్రాజెక్టు, రాయిన్‌పల్లి ప్రాజెక్టు, హల్దీవాగు ప్రాజెక్టులతో పాటు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద వస్తున్నది. జిల్లాకేంద్రం మెదక్‌తో పాటు రామాయంపేట, నర్సాపూర్, చేగుంట తదితర పట్టణాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మెదక్ కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

భారీ వర్షాల నేపథ్యంలో వాతావరణ శాఖ మెదక్ జిల్లాకు రెడ్ అలర్ట్ ప్రకటించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు. అధికారులు పనిచేసే చోట కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని, అత్యవసర పరిస్థితుల్లో స్పందించి ప్రజలకు సేవలు అందించాలన్నారు. లోలెవల్ కల్వర్టులు, నీరు చేరిన రహదారులు దాటకుండా రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు గ్రామ స్థాయి లో ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, పశువులను మేతకు బయటకు వదలకుండా ఇంటిపట్టునే ఉంచాలని, వర్షాలు తగ్గుముఖం పట్టే వరకు వ్యవసాయ పనులకు వెళ్లొద్దని రైతులకు సూచించారు. శిథిలావస్థకు చేరుకున్న ఇండ్లను గుర్తించి ప్రజలు నివాసం ఉండకుండా తరలించాలన్నారు. గజ ఈతగాళ్లను సిద్ధం గా ఉంచుకోవాలన్నారు. జిల్లాస్థాయిలో 9391942 254 24 గంటలు పనిచేసే కంట్రోల్ రూమ్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశామని, ప్రజలు ఏదేని అత్యవసర సేవలకు ఈ నంబర్‌కు కాల్ చేయాలని కలెక్టర్ సూచించారు.

మెదక్ జిల్లాలో...

మండలం	వర్షపాతం (మి.మీ)
మెదక్	175.5
కొల్చారం	120.5
వెల్దుర్తి	103.1
రేగోడ్	100.3
కౌడిపల్లి	98.3
అల్లాదుర్గం	95.3
చిన్నశంకరంపేట	85.0
మాసాయిపేట	82.3
చేగుంట	82.0
చిలిపిచెడ్	75.8
హవేళీఘనపూర్	73.0
శివ్వంపేట	69.4
తూప్రాన్	67.0
నర్సాపూర్	63.2
పెద్దశంకరంపేట	60.0
పాపన్నపేట	58.1
రామాయంపేట	56.2
టేక్మాల్	55.0
నార్సింగి	50.5
నిజాంపేట్	44.8
మనోహరాబాద్	31.6

మెదక్ జిల్లా వెల్దుర్తి మండలంలో ఉప్పలింగాపూర్ బ్రిడ్జి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న హల్దీవాగు

రోజంతా జడివాన

మత్తడి దుంకుతున్న సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువు

- ఉప్పొంగిన నారింజ ప్రాజెక్టు, పలువాగులు
- సింగూరులోకి 15వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నల్లవాగులోకి 1428 క్యూసెక్కుల వరద
- వర్షాలతో మత్తడి దూకిన 20 చెరువులు
- పలు గ్రామాల్లో నీటమునిగిన పంటలు
- అందోలులో అత్యధికంగా 9.8 సెం. మీటర్ల వర్షం
- కిచ్చనపల్లి వద్ద అదుపుతప్పి రోడ్డుపక్కకు దిగిన ఆర్టీసీ బస్సు
- ప్రాణ,ఆస్తినష్టం జరుగకుండా అధికారుల పర్యవేక్షణ
- నేడు జిల్లాలో విద్యాసంస్థలకు సెలవు, ప్రజావాణి రద్దు

సంగారెడ్డి, సెప్టెంబర్ 1(నమస్తే తెలంగాణ) : ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షాలతో సంగారెడ్డి జిల్లా ఆదివారం తడిసి ముద్దయ్యింది. రోజంతా జడివాన కురియడంతో జనజీవనం స్తంభించింది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద వస్తున్నది. సంగారెడ్డి జిల్లాలో 6.8 సెం.మీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. 10 మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 14 మండలాల్లో సాధారణ స్థాయిలో వర్షం కురిసింది. అందోలు మండలంలో అత్యధికంగా 9.8 సెం. మీటర్ల వర్షపాతం నమోదైంది. సింగూరు, నల్లవాగు ప్రాజెక్టుల్లోకి వరద వస్తున్నది. జహీరాబాద్ సమీపంలోని నారిం జ ప్రాజెక్టు పూర్తిగా నిండి ఉప్పొ ంగి ప్రవహిస్తున్నది. జిల్లాలోని గంగకత్వ, మామిడివాగు, జీర్లపల్లి తదితర వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. వర్షాలతోకు జిల్లాలోని 20 చెరువులు మత్తడి దూకాయి. పలు గ్రామాల్లో పంట చేలు నీటమునిగాయి. అందోలు మండలం కిచ్చనపల్లివద్ద రోడ్డుపక్కగా ఉన్న చెట్టు కొమ్మ విరిగిపడటంతో నారాయణఖేడ్ ఆర్టీసీ బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులకు గాయాలు కాలేదు. భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. సోమవారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించింది. సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిని కలెక్టర్ క్రాంతి రద్దు చేశారు.

ఉప్పొంగిన వాగులు

వర్షాలకు కొత్తూరు(బి)లోని నారింజ వాగు ప్రాజెక్టు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 85 ఎంసీఎఫ్‌టీలు కాగా, ప్రాజెక్టు పూర్తిగా నిండి ఉప్పొంగి ప్రవహిస్తూ దిగువన కర్ణాటకలోకి వరద పోతున్నది. న్యాల్‌కల్ మండలంలోని మామిడివాగు ఉప్పొంగి ప్రవహించడంతో రేజింతల్-ఎల్గోయి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్, రేజింతల్, రుక్మాపూర్, ఖలీల్‌పూర్, మిర్జాపూర్‌లో పంటలు పత్తి, మినుము, పెసర, సోయాబీన్ పంటలు నీట మునిగాయి. ఝరాసంగం మండలంలోని పేరవరం వాగు ఉప్పొంగడంతో బొప్పన్‌పల్లి-పేరవరం గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఝరాసంగం మండలంలోని జీర్లపల్లి వాగు ఉప్పొంగి ప్రవహిస్తున్నది. వర్షాలతో జీర్లపల్లి, పేరవరం గ్రామాల్లో పత్తి ఇతర పంటలు నీట మునిగాయి. సదాశివపేట మండలంలోని గంగకత్వ వాడు ఉప్పొంగి ప్రవహిస్తున్నది.

ప్రాజెక్టుల్లోకి వరద నీరు

పుల్కల్ మండలంలోని సింగూరు ప్రాజెక్టులోకి 15622 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 17.298 టీఎంసీలకు చేరుకుంది. సిర్గాపూర్ మండలంలోని నల్లవాగు ప్రాజెక్టులోకి 1428 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 746 ఎంసీఎఫ్‌టీ కాగా, ప్రస్తుతం నీటి మట్టం 471 ఎంసీఎఫ్‌టీకి చేరుకుంది.

వర్షాలతో చెరువులకు జలకళ

వర్షాలతో జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు అలుగు పారుతున్నది. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని పెద్దచెరువు, అందోలులోని అన్నసాగర్ చెరువు నిండుతున్నాయి. జిల్లాలో మొత్తం 1769 చెరువులకు 20 చెరువులు అలుగు పారుతున్నాయి. 15 చెరువులు నీటితో నిండాయి. 358 చెరువుల్లోకి 75 శాతం, 850 చెరువుల్లోకి 50 శాతం వర్షం నీరు వచ్చి చేరింది.

సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలం నారింజ వాగు ప్రాజెక్టు గేట్లపై నుంచి కర్ణాటకకు వెళ్తున్న వరద

సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గంగకత్వవాగు

సంగారెడ్డి జిల్లాలో...

మండలం	వర్షపాతం(సెం.మీటర్లలో)
అందోలు	9.8
హత్నూర	9.3
చౌటకూరు	9.2
పుల్కల్	8.7
కంది	8.3
జిన్నారం	8.2
గుమ్మడిదల	7.4
కొండాపూర్	7.2
ఆర్‌సీపురం	7.1
అమీన్‌పూర్	7.1
సంగారెడ్డి	6.7
నిజాంపేట	6.6
మొగుడంపల్లి	6.5
పటాన్‌చెరు	6.4
మనూరు	6.2
మునిపల్లి	6.1
ఝరాసంగం	6.0
కోహీర్	5.8
సిర్గాపూర్	5.7
న్యాల్‌కల్	5.6

సంగారెడ్డి జిల్లాలో నీటితో కళ కళలాడుతున్న సింగూరు ప్రాజెక్టు

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సీఎస్ శాంతి కుమారి స్పష్టం చేశారు. ఆదివారం డీజీపీ జితేందర్ రెడ్డి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో భారీ వర్షాలపై సమీక్ష నిర్వహించారు. ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమైనా, సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని శాఖల అధికారులు, సిబ్బందిని సమాయత్తం చేయాలన్నారు. ప్రస్తుత సమయంలో ఎవరూ సెలవులో వెళ్లకుండా, పూర్తి అప్రమత్తంగా విధులు నిర్వర్తించేలా చూడాలన్నారు. పాఠశాలలకు సెలవు ప్రకటించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస చర్యలు చేపట్టాలన్నారు. లోలెవల్ వంతెనలు, కాజ్‌వేలపై నుంచి నీరు ప్రవహిస్తున్న మార్గాల ద్వారా వాహనాల రాకపోకలను నిషేధిస్తూ ఇతర ప్రాంతాల మీదుగా వెళ్లేలా సూచించాలన్నారు. చెరువులు, కుంటలు, వాగులు తెగిపోకుండా ముందస్తు అప్రమత్తతతో కూడిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సాధించాలన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి కలెక్టరేట్, సెప్టెంబర్ 1: భారీగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రమాదాలు జరుగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సూచించారు. ప్రాణ, ఆస్తినష్టం జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. చెరువులు, కుంటల వద్దకు ప్రజలను వెళ్లకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచికలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, అవసరమైతే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, కంట్రోల్ రూమ్ నెంబరు 08455-276155కు ఫిర్యాధులు అందించాలని, ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌కు సత్వరమే అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాలు, మున్సిపాలిటీల్లో ఆయా శాఖల అధికారులు, వారు పనిచేస్తున్న స్థలాల్లోనే ఉండాలని, విద్యు త్, రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్, వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కర్ణాటక, మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తున్నందున మంజీర తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లు, కార్యాలయాలను వెంటనే ఖాళీ చేయించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ రూపేశ్, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లాలో దంచికొట్టిన వాన

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబర్1: సిద్దిపేట జిల్లాలో శనివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వాన కురుస్తున్నది. చెరువులు, కుంటలు, వాగుల్లో వరద పారుతున్నది. జిల్లాలో అత్యధికంగా మిరుదొడ్డి మండలంలో 152.3మి.మీటర్లు, అత్యల్పంగా హుస్నాబాద్ మండలంలో 0.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సరాసరి 82.3శాతం వర్షపాతం నమోదైంది. దుబ్బాక 88.8మి.మీటర్లు, సిద్దిపేట రూరల్ 139.3మి.మీ, చిన్నకోడూరు81.8మి.మీ, బెజ్జంకి10.3 మి.మీ, కోహెడ93.3మి.మీ, హుస్నాబాద్0.8మి.మీ, అక్కన్నపేట 103.8మి.మీ, నంగునూరు94.3మి.మీ, సిద్దిపేట అర్బన్87.5మి.మీ, తొగుట 98.8మి.మీ, మిరుదొడ్డి152.3మి.మీ, దౌల్తాబాద్ 67.0మి.మీ, రాయపోల్33.4మి.మీ, వర్గల్ 56.3మి.మీ, ములుగు39.8 మి.మీ, మర్కూక్ 94.5మి.మీ, జగదేవ్‌పూర్86.8మి.మీ, గజ్వేల్82.5 మి.మీ, కొండపాక116.5మి.మీ, కొమురవెల్లి 88.8 మి.మీ, చేర్యాల్54.0మి.మీ, మద్దూర్104. మి.మీ, నారాయణరావుపేట138.5మి.మీ, దూల్మిట్ట 111.0 మి.మీ, అక్బర్‌పేట- బూంపల్లి15.5మి.మీ, కుకునూర్‌పల్లి99.8 మి.మీ వర్షం కురిసింది.లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి.